క్లుప్తంగా

నేడు మాధవపట్నంలో గడప గడపకూ..

సామర్లకోట: మాధవపట్నం ఒకటో సచివాలయం నుంచి మంగళవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి.శ్రీలలిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలన్నారు.

బాధితుడి వైద్యానికి భరోసా


బాధితుడికి ఉత్తర్వులు అందజేస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: మండలంలోని బోయనపూడి గ్రామానికి చెందిన చల్లా అప్పారావుకు వైద్యం నిమిత్తం భరోసా లభించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వులను బాధితుడికి సోమవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సామర్లకోటలోని స్వగృహంలో అందజేశారు. ఈ ఉత్తర్వుల మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో రూ.లక్షతో వైద్యం చేస్తారని దొరబాబు తెలిపారు. దీనికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆసుపత్రి వారికి వైద్య ఖర్చులు చెల్లిస్తారన్నారు. బోయనపూడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్‌పై బోల్తా పడిన లారీ


వ్యాన్‌పై బోల్తా పడిన బియ్యం లోడ్ లారీని పరిశీలిస్తున్న పోలీసులు

సామర్లకోట: ఆగి ఉన్న వ్యాన్‌పై బియ్యం లోడ్‌తో వెళుతున్న లారీ బోల్తా పడటంతో పెను ప్రమాదం తప్పింది. సామర్లకోటలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఐదు తూముల సమీపంలో విక్రయించే చేపలు కొనుగోలు చేసేందుకు వ్యాన్‌ను డ్రైవర్ మర్రి శ్రీనివాస్ ఆపాడు. ఈ నేపథ్యంలో పెద్దాపురం పట్టాభి ఆగ్రో రైస్‌మిల్లు నుంచి బియ్యం లోడ్‌తో కాకినాడ పోర్టుకు వెళుతున్న లారీ అదుపుతప్పి వ్యాన్‌పై బోల్తా పడింది. దీంతో డ్రైవింగ్ సీటులో శ్రీనివాసు, వ్యాన్‌లో నిద్రపోతున్న అతని కుమారుడు మర్రి సత్యనాథం స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్, క్లీనర్ పరారయ్యారని ఎస్సై టి.సునీత తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఏఎస్పీ పరిశీలన

సామర్లకోట: మాజీ సీఎం చంద్రబాబునాయుడు నియోజకవర్గంలో పర్యటించే ప్రాంతాలను జిల్లా అదనపు ఎస్పీ పి.శ్రీనివాసు సోమవారం పరిశీలించారు. ఈ నెల 16న పెద్దాపురం నుంచి సామర్లకోట వరకూ పర్యటించే ప్రదేశాలను సోమవారం సాయంత్రం ఆయన చూశారు. స్థానిక గడియార స్తంభం వద్ద మీటింగ్ ప్రదేశాన్ని, రాత్రికి విశ్రాంతి తీసుకునే సుగర్ ఫ్యాక్టరీ గెస్ట్ హౌస్‌ను ఆయన పరిశీలించారు. సీఐ కె.దుర్గాప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉర్స్ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

కొత్తపల్లి: బషీర్ బీబీ ఉర్స్ ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను ఎస్సై రామలింగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. పొన్నాడలో ఉన్న బషీర్ బీబీ(బంగారు పాప) దర్గాలో శుక్రవారం నుంచి ఆదివారం వరకూ జరగనున్న ఉర్స్ ఉత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. సీసీ కెమేరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో ఆదివారం జరిగే గంధోత్సవం ఎంతో కీలకమైందన్నారు. ఈ ఉత్సవాలకు కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు మండలాలనుంచి సుమారు 60 మందితో సిబ్బందితో భారీగా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దర్గా వద్ద పోలీస్ కంట్రోలు రూం కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

బ్యాడ్మింటన్‌లో క్రీడాకారుల ప్రతిభ

నాగమల్లితోట జంక్షన్: కడప జిల్లా పొద్దుటూరులో ఈ నెల 2 నుంచి 5 వరకూ జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి హాజరైన క్రీడాకారులు పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. 75 ప్లస్ సింగిల్స్‌లో కర్రి భామిరెడ్డి, 45 ప్లస్ సింగిల్స్‌లో డి.సునీల్‌కుమార్, 35 ప్లస్ సింగిల్స్ మహిళా విభాగంలో ఎం.సుభాషిణి, 75 ప్లస్ డబుల్స్‌లో కర్రి భామిరెడ్డి, వి.సోమరాజు, 70 ప్లస్ డబుల్స్‌లో చుండ్రు గోవిందరాజు, బి.కృష్ణమూర్తి, 45 ప్లస్ డబుల్స్‌లో పీఎస్‌వీ జగన్నాథ్, డి.సునీల్‌కుమార్ జట్టు విజేతలుగా నిలిచారు. 45 ప్లస్ సింగిల్స్‌లో పీఎస్‌వీ జగన్నాథ్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. కాకినాడ జిల్లా బ్యాడ్మింటన్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు మురళీధర్, కార్యదర్శి చుండ్రు గోవిందరాజు, డీఏఎస్ ప్రసాద్ వర్మలు సోమవారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు.

పథకాలు అందించడమే లక్ష్యం

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- జగనన్న గృహ సారథులకు శిక్షణ


వేట్లపాలెం సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందించడమే లక్ష్యంగా గృహ సారథులు పనిచేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం మండలంలోని పీబీ దేవం, వేట్లపాలెం గ్రామాల్లో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన పెంచడంతో పాటు సీఎం జగన్ ప్రభుత్వంలో అందుతున్న లబ్ధిని వివరించాలన్నారు. సీఎం జగన్ సారథ్యంలో సంక్షేమ పాలన సాగుతుందన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి వారి అభిప్రాయాలను తెలుసుకోవడానికి గృహ సారథులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందరికీ వివరించాలని తెలిపారు. ఈ మేరకు గృహ సారథులకు కిట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పీబీ దేవం ఎంపీటీసీ సభ్యులు మలకల సూర్యారావు, డాక్టర్ వైవీబీ ప్రసాదరావు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ తోట సత్య, వేట్లపాలెం ఎంపీటీసీ సభ్యులు బొబ్బరాడ లక్ష్మి, అనుసూరి సత్యవతి, డి.రాణి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం సీఎం జగన్ పాలన

పెద్దాపురం: దేశానికే సీఎం జగన్ పాలన ఆదర్శంగా నిలుస్తుందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. కాండ్రకోటలో సోమవారం గుడివాడ, సిరివాడ, మర్లావ, కాండ్రకోట, ఉలిమేశ్వరం, తూర్పుపాకల గ్రామాల జగనన్న గృహ సారథులకు సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత గృహ సారథులపై ఉందన్నారు. 2024లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని దొరబాబు పిలుపునిచ్చారు. వలంటీర్లు ఇబ్బందులు ఉండకూడదనే సీఎం గృహ సారథుల నియామకం చేపట్టారన్నారు. వలంటీర్లు వైఎస్సార్ సీపీ కార్యకర్తలంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు తప్పుడు సంకేతాలు ఇస్తున్నారన్నారు. దీనిని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సామర్లకోట మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు యినకొండ వీర విష్ణుచక్రం మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం గృహ సారథుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గోపు మురళి, సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు, సర్పంచులు కనపర్తి చీమదొర, ఆకుల వీరబాబు, ఉప సర్పంచ్ జోకా నానాజీ, కామన రామకృష్ణ, గంటా రామస్వామి, ఒబిలిశెట్టి వెంకటేశ్వరరావు సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'స్పందన'


పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఏఓ సరస్వతి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి వారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో డివిజన్ పరిధి నుంచి నాలుగు అర్జీలు అందాయని ఆమె తెలిపారు. అనంతరం సరస్వతి విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేశామన్నారు. స్పందనకు వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారులపై ఉంటుందన్నారు. భూమి రీ సర్వే చేయాలని, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మార్చాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని తదితర వాటిపై ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం


సాయి సేవా గ్రూపు ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువకులు

పెద్దాపురం: స్థానిక సాయి సేవా సంస్థ గ్రూపు ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబి రం నిర్వహించారు. స్థానిక మెయిన్‌రోడ్డు వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో కాకినాడ, పెద్దాపురం రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. ఈ సందర్భంగా సాయి సేవా గ్రూప్ సభ్యుడు అద్దేపల్లి రమేష్ మాట్లా డుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అత్తెం రాజేష్, రమేష్, అద్దేపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయం

- గృహ సారథుల శిక్షణలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు


గృహ సారథుల శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజల మన్ననలు పొందుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా అంతా పని చేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పిలుపునిచ్చారు. గొల్లప్రోలులో సోమవారం నిర్వహించిన గొల్లప్రోలు మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కుల, మత, వర్గ విబేధాలకు తావు లేకుండా ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న సీఎం జగన్ చేపట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసమే గృహ సారథులను నియమించామన్నారు. ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లాలన్నారు. గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదో తెలుసుకుని అందక పోతే వెంటనే అందేలా చూడాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి ప్రతీ లబ్ధిదారుడికి మెరుగైన సేవలు అందించడంలో వలంటీర్ల వ్యవస్థ చరిత్ర సృష్టించిందన్నారు. కాని దీనిని చూడలేక ప్రతి పక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని ప్రజలే తిప్పికొడుతున్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమై చరిత్రహీనుడిగా చంద్రబాబు ప్రజల ముందుకు రాలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో 94 శాతం అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పచ్చ చొక్కాలకే పథకాలు పంచుకుంటే సీఎం వైఎస్ జగన్ మాత్రం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అందరికీ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎక్కడా అవినీతికి చోటు లేకుండా పైరవీలతో సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారుడి ఖాతాలకే లబ్ధి అందేలా చేశారన్నారు. గొల్లప్రోలు జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు మాట్లాడుతూ ప్రజలందరూ మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా చేయాలని చూస్తున్నారన్నారు. గృహ సారథులు పార్టీని బలోపేతం చేసే రథసారథులుగా మారి పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు గృహ సారథుల విధి విధానాలను తెలియజేయగా పలువురు ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ దాసం వెంకటేష్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, కడింశెట్టి బాస్కరరెడ్డి, వైస్ ఎంపీపీ బత్తిన మంగ, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు తెల్లపు చిన్నారావు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహ సారథులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హిమమహేశ్వరి

పెద్దాపురం: మండలంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పెద్దాపురం ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, హౌసింగ్ ఈఈ రాజు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల సచివాలయాల పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఉగాది నాటికి కాలనీల్లో నూతన గృహ ప్రవేశాలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, కార్యాలయ పరిపాలనాధికారి శ్రీనివాస్, సీనియర్ సహాయకుడు జగన్నాథం, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో సాగాలి


ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దాపురం: సామాజిక స్పృహతో యువత సాగినప్పుడే ఉత్తమ సమాజం ఏర్పడుతుందని పెద్దాపురం జంగం సంతోషి, సాగర్ కళాశాల కరస్పాండెంట్ పి.శ్రీదేవి అన్నారు. స్థానికంగా యువ చైతన్య సేవా సమితి, నెహ్రూ యువజన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో యూత్ లీడర్ షిప్ అండ్ కమ్యూనిటీ అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో భాగంగా అగ్నిమాపక సిబ్బంది పీఆర్ఆర్ ప్రసాద్, సత్యనారాయణలు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంతోషి, శ్రీదేవి మాట్లాడుతూ యువత లీడర్‌షిప్ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి.సాయికృష్ణ,, అచ్యుతరామయ్య, వి.శ్రీను, నల్లా లీలా వినోద్‌కుమార్, మణిమాల, రాధా శ్రావణి, ఎన్వైకే వలంటీర్లు పాల్గొన్నారు.

భజన పోటీల్లో విజేతలకు బహుమతులు


ప్రథమ బహుమతి అందుకున్న వేట్లపాలెం భజన మండలి

సామర్లకోట: వేట్లపాలెంలో వేంచేసి ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భజన పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా స్థాయిలో ద్రాక్షారామ భజన మండలి, మండల స్థాయిలో వేట్లపాలెం ప్రథమ స్థానాల్లో నిలిచారు. సోమవారం విజేతల వివరాలను ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో శ్రీఅయ్యప్ప భజన మండలి ప్రథమ విజేత కాగా రూ.మూడు వేలు, గండేపల్లి మండలం తాళ్లూరుకు చెందిన శ్రీలక్ష్మీశ్రీనివాసా భజన మండలికి రూ.రెండు వేల బహుమతి అందజేశామన్నారు. మండల స్థాయిలో విజేత శ్రీసీతారామ మహిళా భజన మండలికి రూ.రెండు వేలు, ద్వితీయ స్థానం పొందిన జి.కొత్తూరుకు చెందిన శ్రీరామదుర్గ భజన మండలికి రూ.వెయ్యి అందించామని తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా గుణ్ణం శారదాదేవి, అమలకంటి చంటిబాబు, పెండ్యాల నాగేశ్వరరావు మాస్టార్లు వ్యవహరించారు. స్వామివారి కల్యాణ ఉత్సవాలు, భజన పోటీలు విజయవంతంగా జరగడానికి సహకరించిన అందరికీ నాగేశ్వరరావు మాస్టారు కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని మతాలకూ సమ ప్రాధాన్యం

- ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నామని.. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు సంబంధించిన ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక 12వ డివిజన్ సంజయ్‌నగర్ ప్రాంతంలో రూ.35 లక్షలతో నిర్మిస్తున్న పిడుగులమ్మ తల్లి ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పలువురు ప్రముఖులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతగా పూజించే పురాతన పిడుగులమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కాకినాడలోని అన్ని కులాలకు సంబంధించిన ప్రార్థనా మందిరాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హిందువులకు సంబంధించి వేంకటేశ్వర ఆలయం, శివాలయంతో పాటు అనేక ఆలయాలను అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వం సమకూర్చిన రూ. కోటి నిధులతో పాటు తాను సొంతంగా మరో రూ. కోటి ఇచ్చి నగరంలోని చర్చిలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి వెల్లడించారు. అలాగే రెండు మసీదుల నిర్మాణం కూడా చేపట్టామన్నారు. ఇలా అన్ని మతాల సంప్రదాయాలను, భక్తి భావాన్ని పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్తున్నామని ద్వారంపూడి చెప్పారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద సుమారు 800 మందితో విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కరుణాకరరెడ్డి, కోనాడ దుర్గాప్రసాద్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ఎస్ రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరం

సామర్లకోట: ఆధార్ కార్డులను అప్‌గ్రేడ్ చేసుకోవడానికి మండలంలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉండూరు, పనసపాడు, మాధవపట్నం, వీకే రాయపురం, వేట్లపాలెం, పీబీ దేవం గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో, ఉండూరు, పవర, వేట్లపాలెం, జి.మేడపాడు గ్రామాల్లో 9, 10 తేదీల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తామన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి


దుర్గాడలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

పిఠాపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీసీఈఓ సత్యనారాయణ అధికారులకు సూచించారు. ఆయన సోమవారం గొల్లప్రోలు మండలం దుర్గాడ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మా ణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మా ణ శాఖ ఏఈ ఏసుబాబును ఆదేశించారు. వీలైనంత తొందరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా లబ్ధిదారులను అప్రమత్తం చేయాలన్నారు. వారికి అవసరమైన సామగ్రిని అందించాలని ఆయన సూచించారు. ఈయన వెంట ఈఓపీఆర్డీ కుమార్, కార్యదర్శి రాజేందర్ తదితరులున్నారు.

క్రమబద్ధీకరణ చేసుకోండి


మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ నూకరాజు

కరప: ఆక్వా జోన్‌లో లేని చెరువుల సర్వే నంబర్లను క్రమబద్ధీకరించడానికి గ్రామసభలు నిర్వహించి, రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు ఎఫ్‌డీఓ (ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) ఆర్.నూకరాజు తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా జోన్ పరిధిలో లేకుండా చెరువులు సాగు చేస్తున్న భూముల సర్వే నంబర్లు చదివి వినిపించి, వాటిని క్రమబద్ధీకరించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచనలు చేశారు. అనధికార చెరువుల భూములను ఆక్వా జోన్ పరిధిలోకి మార్పు చేయించుకునేందుకు ప్రభుత్వాదేశాల మేరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ కర్రె స్వప్న, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, కార్యదర్శి వి.సునీల్‌కుమార్, వీఆర్వో కె.సూర్యనారాయణరెడ్డి, వీఎఫ్ఏ వి.గాయత్రీ పాల్గొన్నారు. అనంతరం అరట్లకట్ట, జెడ్.భావారం గ్రామాల్లో సభలు నిర్వహించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


వేట్లపాలెం ఎరువుల దుకాణ గోదాములో నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సామర్లకోట: రైతులకు సక్రమంగా ఎరువులు, పురుగు మందులు అందజేయాలనే లక్ష్యంతో కాకినాడ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక స్క్వాడ్ తనిఖీలు చేస్తున్నాయి. సోమవారం వేట్లపాలెం శ్రీసత్యసాయి ఏజెన్సీ, సామర్లకోటలోని శ్రావణి ఎరువులు పురుగు మందుల దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. ఏడీఏ స్వాతి మాట్లాడుతూ దుకాణాల్లో స్టాక్, రికార్డులను పరిశీలించామని తెలిపారు. అదే విధంగా రోజూ విక్రయాలతో పాటు స్టాక్ బోర్డులో నమోదు చేసే విధంగా ఉన్నది లేనిదీ తనిఖీ చేశామన్నారు. ఫెర్టిలైజర్స్ షాపుల యజమానులు సక్రమంగా షాపులను నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ తనిఖీల్లో ఏఓలు ఐ.సత్య, వెంకటలక్ష్మి, ఏఈఓ ఎంవీ సతీష్ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు


పీబీ దేవంలో అమ్మవారికి పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మాఘ మాసం, స్వామివారికి ప్రీతైన సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జామున స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం నుంచి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

ఘనంగా దొడ్డి గంగమ్మ జాతర

పీబీ దేవం గ్రామ మంచినీటి చెరువు గట్టుపై వేంచేసి ఉన్న దొడ్డి గంగమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన తోటకూర వంశస్తుల ఇలవేల్పుగా అమ్మవారిని కొలుస్తారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి వారంతా కలసి అమ్మవారి జాతరను నిర్వహిస్తారు. దీనిలో భాగంగా అమ్మవారికి పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. జాతర ఉత్సవంలో చింతలూరు కళాకారుల గరగల నృత్యం, డప్పుల వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేత్రపర్వంగా శ్రీపుష్పయాగం

- ముగిసిన కుంతీమాధవ స్వామి కల్యాణోత్సవాలు
- తరలి వచ్చిన భక్తజనం


కుంతీమాధవస్వామివారి శ్రీపుష్పయాగం

పిఠాపురం: పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురంలోని కుంతీమాధవ స్వామి దివ్య కల్యాణోత్సవంలో భాగంగా చివరి రోజైన సోమవారం స్వామివారి శ్రీపుష్పయాగం నేత్రపర్వంగా నిర్వహించారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న కల్యాణోత్సవాలు శ్రీపుష్పయాగంతో ఘనంగా ముగిశాయి. గత వారం రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక అలంకారాలు, అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెండ్లి కుమారుడైన కుంతీ మాధవస్వామిని పెండ్లి కుమార్తెగా అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, నగలతో అర్చకులు అలంకరించారు. పువ్వులతో సుందరంగా అలంకరించిన వేదికపై అధిష్టింపజేశారు. వేదపండితులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చక్రవర్తుల నరసింహాచార్యులు, చక్రవర్తుల మాధవాచార్యులు యాజ్ఞీకంలో వేదమంత్రాల నడుమ స్వామివారి శ్రీపుష్పయాగం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించగా భక్తులు పూర్తి సహాయ సహకారాలు అందజేసినట్టు ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వరదా శేషు, ట్రస్టుబోర్డు సభ్యులు పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

కరప: కాకినాడలోని శుభం కాపు ఫంక్షన్ హాలులో రియాన్ ఆర్‌యూ షోటోకాన్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే పోటీలలో నడకుదురు విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ కరాటే పోటీలు ఆదివారం జరగ్గా కలర్ బెల్ట్– కటా విభాగంలో (50– 55 కిలోలు) నడకుదురు విద్యార్థిని ముమ్మిడి సాయిరఘు ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతకు గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాలను నిర్వాహకులు అందజేశారు. సాయిరఘును పలువురు అభినందించారు.